క్లుప్తంగా

జాతరలో సౌకర్యాలు కల్పించాలని వినతి


శాలువాతో సన్మానిస్తున్న నాయకులు

రెబ్బెన: గోలేటి భీమన్న ఆలయంలో ఆదివారం నిర్వహించే జాతర సందర్భంగా ఆలయం వద్ద విద్యుత్, మంచినీటి సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కలగకుండా సింగరేణి యాజమాన్యం తోడ్పాటు అందించాలని కోరారు. అనంతరం ఆయనను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దుర్గం రవీందర్, సాయికిరణ్, సాయికుమార్, ఆలయ పూజారి హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

‘రైతులకు యుద్ధప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు’

ఆసిఫాబాద్: రైతులకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తూ యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ కనెక్షన్లు మంజూరు చేస్తున్నామని ట్రాన్స్‌కో ఎస్‌ఈ రాథోడ్ శేషారావు ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్ పరిధిలో ఇప్పటి వరకు 13,833 వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయని, కొత్తగా 2024 గత నెల చివరి వరకు 1029 కనెక్షన్లు ఇచ్చినట్లు తెలిపారు. 2023 సంవత్సరంతో పోల్చుకుంటే దాదాపు 3.5 శాతం కనెక్షన్లు పెరిగాయన్నారు.

108లో ప్రసవం


శిశువును అప్పగిస్తున్న సిబ్బంది

తిర్యాణి: గర్భిణీ 108 అంబులెన్స్‌లో పండంటి ఆడబిడ్డకు జన్మనించిన సంఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రోంపెల్లి పంచాయతీ పరిధిలోని రాంజీగూడ గ్రామానికి చెందిన కుర్సెంగ లక్ష్మి అనే గర్భిణీని తిర్యాణి పీహెచ్‌సీ వైద్యులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. ఈ నేపథ్యంలో 108 అంబులెన్స్‌లో గర్భిణీని తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు అధికమవడంతో ఈఎంటీ శ్రీకాంత్ చికిత్స అందించి డెలివరీ చేశారు. అనంతరం సమీపంలోని బెల్లంపెల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో వారిని చేర్పించి చికిత్స అందిస్తున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ మన్సూర్ ఇటీవల సెల్‌ఫోన్ పోగొట్టుకోగా శనివారం సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్ రికవరీ చేసి అందచేసినట్లు ఎస్సై కొమురయ్య తెలిపారు. ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు.

ఉన్నతస్థాయికి ఎదగాలి

చింతలమానెపల్లి: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నతస్థాయికి ఎదగాలని బాబాపూర్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుక్యా గోపి అన్నారు. శనివారం మండలంలోని బాబాపూర్ బాలికల ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నలుగుపల్లి ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ 10వ తగరతి పరీక్షల్లో విద్యార్థులు భయాందోళనలకు గురికాకుండా హాజరు కావాలన్నారు. అనంతరం విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విశ్వహిందూ పరిషత్ నూతన కార్యవర్గం

సిర్పూర్(టి): విశ్వహిందూ పరిషత్ కౌటాల ప్రఖండ నూతన కార్యవర్గాన్ని శనివారం మండలకేంద్రంలోని శ్రీ బాలాజీ వేంకటేశ్వర ఆలయంలో జిల్లా అధ్యక్షుడు రెవెల్లి రాజలింగు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గజ్జెల దత్తుమూర్తి, ఉపాధ్యక్షులుగా పైడి గిరీష్‌కుమార్, థోర్ గణేశ్, పైడి విలాస్, కార్యదర్శిగా రాపర్తి శ్రీకాంత్, మాతృశక్తి సంయోజక్‌గా జ్యోతి, భజరంగ్ దళ్ సంయోజక్‌గా డి.ప్రశాంత్, సహ సంయోజక్‌గా సిడాం భీంరావ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడిగా బందేళ్ల శివ, ఉపాధ్యక్షులుగా వడ్డేటి సందీప్‌లను ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధ్యక్షురాలు గొట్టిపర్తి కనకతార, జిల్లా కార్యదర్శి వేముల రమేష్, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలలో వసతులు కరువు

- సమస్యల్లో ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల
- హాస్టల్ భవనం ఉన్నా ప్రారంభానికి నోచుకోని వైనం
- నాలుగేళ్లు కావస్తున్నా పట్టించుకునేవారు లేరు


వసతిగృహం కోసం నిర్మించిన భవనం

వాంకిడి: ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వాలు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. మండలంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో వసతులు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. బెండార గ్రామ శివారులోని ఉపమార్కెట్ యార్డు సమీపంలో 2019లో సుమారు రూ.10 కోట్లతో కళాశాల భవనం నిర్మించారు. రెండంతస్తులలో 30 గదులతో విలాసవంతంగా నిర్మించిన కళాశాలను 2021లో ప్రారంభించారు. భవనంతో పాటు బాలికలకు వసతి కల్పించేందుకు ప్రత్యేక భవనం సైతం నిర్మించారు. అయితే నీరు, రోడ్డు, బస్‌షెల్టర్, ఆట స్థలం, ప్రహరీ వంటి మౌలిక సదుపాయాలు కల్పించలేదు. కళాశాలలో బీఎస్సీ ఎంపీసీ, బీజెడ్‌సీ, బీకామ్, బీఏ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉండగా ఫస్ట్, సెకండ్, థర్డ్ ఇయర్‌లలో కలుపుకుని మొత్తం 609 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కళాశాలలో ఇద్దరు రెగ్యులర్, ఇద్దరు కాంట్రాక్ట్ బేసిక్, 12 మంది గెస్ట్ లెక్చరర్‌లు ఉన్నారు.

సదుపాయాలు లేక..

మోడల్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కనీస సదుపాయాలు కరువయ్యాయి. విద్యార్థులు ఆడుకునేందుకు ఆట స్థలం కూడా లేదు. కళాశాల భవనం గుట్ట ప్రాంతంలో ఉండగా ముందు భాగంలోని స్థలం మొత్తం గుంతలతో అధ్వానంగా ఉంది. యంత్రాలతో చదును చేయించి, ప్రహరీ నిర్మిస్తే విద్యార్థులకు ఆట స్థలంగా ఉపయోగపడుతుంది. కళాశాలకు రోడ్డు సౌకర్యం కూడా లేదు. ఎన్‌హెచ్ -363 నుంచి కళాశాల వరకు మట్టి రోడ్డే ఉండగా వర్షాకాలంలో బురదగా మారుతోంది. కాగా బస్‌షెల్టర్ సైతం లేకపోవడంతో బస్సు కోసం వేచి చూసే విద్యార్థులు ఎండలో ఎండుతూ, వర్షంలో తడుస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

నీటి కొరతతో ఇబ్బందులు..

మోడల్ డిగ్రీ కళాశాలలో నీటి కొరత ప్రధాన సమస్యగా మారింది. కళాశాల భవనం గుట్ట ప్రాంతంలో ఉండటంతో బోరు వేసినా నీళ్లు పడలేదు. దీంతో సదరు కాంట్రాక్టర్ మరో ప్రయత్నం చేయకుండా వదిలేశాడు. అప్పటి నుంచి మిషన్ భగీరథ నీటినే అవసరాలకు వాడుకుంటున్నారు. కొన్ని సందర్భాల్లో మిషన్ భగీరథ నీరు సరఫరా కాకపోతే కళాశాలకు నీటి చుక్క కూడా అందుబాటులో ఉండడం లేదు. కళాశాల ప్రారంభమై నాలుగేళ్లు గడుస్తున్నా అధికారులు నీటి సమస్య పరిష్కారానికి దృష్టి సారించలేదు. కొన్ని సందర్భాల్లో నీరు లేక బాత్రూమ్‌లు కూడా వాడుకోలేని పరిస్థితి ఏర్పడుతుందని విద్యార్థినులు వాపోతున్నారు.

వసతి గృహం ప్రారంభమెప్పుడో..

కళాశాల భవనానికి అనుసంధానంగా బాలికలకు వసతి కల్పించేందుకు ప్రత్యేక భవనం సైతం నిర్మించారు. భవన నిర్మాణం పూర్తయ్యి నాలుగేళ్లు కావస్తున్నా ప్రారంభానికి మాత్రం నోచుకోవడం లేదు. మండలంలోని మారుమూల పల్లెల నుంచి, జిల్లాలోని జైనూర్, కెరమెరి, ఆసిఫాబాద్ తదితర మండలాల నుంచి బాలికలు నిత్యం బస్సులో రాకపోకలు సాగిస్తూ తరగతులకు హాజరవుతున్నారు. దూరప్రాంతాల నుంచి ప్రయాణం చేయడంతో పాఠాలు ఎక్కడం లేదని వాపోతున్నారు. వసతి గృహ భవనంలో సిబ్బందిని నియమించి ప్రారంభిస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు మేలు జరుగుతుందని, ఉన్నతాధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వసతిగృహం ప్రారంభించాలి



నిత్యం జైనూర్ నుంచి కళాశాలకు వస్తున్నాను. జైనూర్ నుంచి ఆసిఫాబాద్ వరకు అక్కడి నుంచి కళాశాల వరకు రెండు బస్సులు మారాల్సి వస్తుంది. కొన్నిసార్లు కళాశాలకు చేరే వరకు ఆలస్యం అవుతుంది. వసతి గృహం కోసం నిర్మించిన భవనాలను ప్రారంభిస్తే చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

– మనీష, డిగ్రీ విద్యార్థిని, జైనూర్

చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నాం



నేను ప్రతీరోజు కెరమెరి మండలం నుంచి కళాశాలకు వస్తుంటాను. కళాశాలకు వచ్చే వరకు రెండు నుంచి మూడు గంటలు పడుతుంది. ప్రయాణంలోనే ఎక్కువ సమయం గడుస్తుండడంతో చదువుపై దృష్టి సారించలేకపోతున్నా.

– క్రాంతి, డిగ్రీ విద్యార్థిని, కెరమెరి

సమస్యలు పరిష్కరించాలి



ఎన్‌హెచ్ -363 నుంచి కళాశాల వరకు మట్టి రోడ్డు అధ్వానంగా ఉటుంది. బీటీ లేదా సీసీ రోడ్డు నిర్మించాలి. ప్రహరీ గోడ నిర్మించి ఆట స్థలం ను చదును చేయించాలి. కళాశాలలో తాగు నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలి.

– బండె అఖిల్, డిగ్రీ విద్యార్థి

‘ఉదయం, సాయంకాలం పనులు చేయండి’


కూలీలతో మాట్లాడుతున్న ఏపీవో మల్లయ్య

కెరమెరి: ఉదయం, సాయంకాలం పనులు చేయాలని ఉపాధిహామీ పథకం ఏపీవో మల్లయ్య అన్నారు. శనివారం మండలంలోని పెద్ద కరంజివాడ, గోండ్‌గూడ గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కూలీలతో మాట్లాడారు. ప్రతీరోజు రూ. 300 కూలి పడేలా పనులు చేయాలన్నారు. ఎండలు ముదిరిపోతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పని ప్రదేశంలో టెంట్‌లు, తాగునీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లను ఏర్పాటు చేయాలని టీఏకు సూచించారు. జాబ్ కార్డులు కలిగిన ప్రతీ కూలీ ఉపాధి పనులు చేయాలన్నారు. ఆయన వెంట టీఏ ధరంసింగ్ ఉన్నారు.

ఎల్లాపటార్‌లో ఇఫ్తార్


ఇఫ్తార్‌లో పాల్గొన్న శివరాం నాయక్

లింగాపూర్: మండలంలోని ఎల్లాపటార్ గ్రామంలో రంజాన్ సందర్భంగా శనివారం ముస్లింలకు యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు శివరాం నాయక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ ఏర్పా టు చేశారు. జాదవ్ సంజీవ్, ధరంపాల్, ప్రేమ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాంకిడి: సన్మానిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్ కుమార్



రెబ్బెన: మహిళా సిబ్బందిని సన్మానిస్తున్న పోలీసులు



సిర్పూర్(టి): సిబ్బందిని సన్మానిస్తున్న ఎస్సై, పోలీసులు



ఘనంగా మహిళా దినోత్సవం

ఆసిఫాబాద్: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని వాసవీ మందిరంలో వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జడ్జిని ఆర్యవైశ్య మహిళలు పూలదండలతో ఘనంగా సన్మానించారు. సీనియర్‌న్యాయవాది ముక్త సురేశ్, వాసవీ క్లబ్ ప్రతినిధులు శ్రీనివాస్, వెంకన్న, ఎకిరాల శ్రీనివాస్, శంకర్, గుండ వెంకన్న, పాత శ్రీనివాస్, కృష్ణమూర్తి, కిషోర్, మహిళలు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో..

జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి అనంత లక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఎం విశ్వనాథ్, గిరిజన కళాశాల ప్రిన్సిపాల్ శారద, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

లింగాపూర్: మండల కేంద్రంలోని రైతువేదికలో శనివారం మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రూపుల్లో ఉత్తమంగా పని చేస్తున్న మహిళలను శాలువాలతో సన్మానించారు. ఏపీఎం తిరుపతి, సీసీ ప్రదీప్, కైలాశ్, గణేశ్, సంధ్యారాణి మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కెరమెరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉపాధ్యాయులతో పాటు బదిలీపై వెళ్లిన మహిళా టీచర్లను శాలువాలతో సత్కరించారు. ఎంఈవో ఆడే ప్రకాశ్ మాట్లాడుతూ మహిళల గొప్పతనం మాటల్లో చెప్పలేనిదన్నారు. ఈ సందర్భంగా వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు కడేర్ల రంగయ్య, జాదవ్ రవీందర్, శివప్రసాద్, మౌనిక, నందిని, భాస్కర్, అజయ్, సమ్మయ్య తదితరులు ఉన్నారు.

వాంకిడి: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని తేజాపూర్, పాటగూడ, ఖమాన తదితర గ్రామ పంచాయతీలతో ఉపాధిహామీ పనులు 100 రోజులు పూర్తి చేసుకున్న మహిళలను, ఎస్‌హెచ్‌జీ లీడర్లను, పాఠశాలల చైర్మన్‌లను సన్మానించారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, ఎంఈవో శివ చరణ్, పంచాయతీ కార్యదర్శులు పోషం పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మహిళా దినోత్సవాన్ని శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్‌లో ఎస్సై కమలాకర్ ఆధ్వర్యంలో పోలీసుస్టేషన్‌లోని మహిళా కానిస్టేబుల్, సిబ్బందిని శాలువాలతో సన్మానించారు. సిర్పూర్(టి) గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ పారిశుద్ధ్య మహిళా కార్మికులతో కలిసి కేక్‌కట్ చేయించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు స్థానిక సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో వేడుకలు నిర్వహించారు.


కెరమెరి: మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవో ఆడే ప్రకాశ్

కౌటాల: ఆధునిక కాలంలో అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్న మహిళలే అందరికి మార్గదర్శకులని సీఐ ముత్యం రమేశ్ అన్నారు. శనివారం కౌటాల సర్కిల్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను నిర్వహించారు. కౌటాల సర్కిల్ పరిధిలోని మహిళా పోలీస్ కానిస్టేబుళ్లను సన్మానించి కేక్ కట్ చేసి చీరలు పంపిణీ చేశారు. కౌటాల, బెజ్జూర్, సిర్పూర్(టి), చింతలమానెపల్లి ఎస్సైలు ఎస్. మధుకర్, ప్రవీణ్, కమలాకర్, నరేశ్, పోలీసులు పాల్గొన్నారు.

బెజ్జూర్: బెజ్జూర్ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఐకేపీ, ఐసీడీఎస్, ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. సేవలను అందిస్తున్న పలువురిని శాలువాలతో సన్మానించారు.

రెబ్బెన: రెబ్బెన పోలీస్‌స్టేషన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తున్న మహిళా పోలీస్ సిబ్బందిని సీఐ బుద్దె స్వామి, ఎస్సై చంద్రశేఖర్‌లు శాలువాలతో సన్మానించి విధుల పట్ల మహిళా పోలీస్ సిబ్బంది చూపుతున్న అంకితభావాన్ని, ధైర్య సాహసాలను ప్రశంసించారు. ఈ సందర్భంగా మహిళా సిబ్బంది కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు.

నేటి తరం మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తూ అందరికి ఆదర్శంగా నిలవాలని ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పర్లపెల్లి వనజ, వైస్ చైర్మన్ కుందారపు శంకరమ్మలు అన్నారు. మండల కేంద్రంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. బీఆర్‌ఎస్ మహిళా మండల అధ్యక్షురాలు అన్నపూర్ణ అరుణ, నాయకురాళ్లు అహల్యాదేవి, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


కౌటాల: పోలీస్‌సర్కిల్ కార్యాలయంలో..

వాంకిడి: మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో కొనసాగుతున్న శ్రామ్‌నేర్ శిబిర్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిజాబాయి, సావిత్రిబాయి పూలే, రమాబాయి అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బౌద్ధ గురువు భంతే బదంత్ ధమ్మ సారథి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. బౌద్ధ గురువు రాహుల్ బోధి, వినయ్ నిబ్బాన్, నాయకులు జైరాం ఉప్రె, దుర్గం సందీప్, ధర్మబాయి, పాండు జాడె తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని చేడ్వాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులను ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాకేశ్ శనివారం శాలువాతో సన్మానించారు. ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఏఏపీసీ చైర్మన్ తార, కార్మికులు అమ్మక్క, సరిత, భాగ్య, శోభ, కాశక్క, శశికళ, ఉపాధ్యాయులు శిల్ప, సుమిత, స్వప్న, తార, సంతోష్, తాజ్‌పాషా, రాజ్ కమలాకర్‌రెడ్డి, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని పంచాయతీ కార్యాలయాలలో మహిళా కార్మికులకు సన్మానం చేశారు.


లింగాపూర్‌లో..


ఆసిఫాబాద్: అనంత లక్ష్మిని సన్మానిస్తున్న మహిళలు


పెంచికల్‌పేట్: కార్మికులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మహిళలు ఆర్థికాభివృద్ధి చెందాలి


కొరారి గ్రామసభలో పాల్గొన్న మహిళలు

కెరమెరి: మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో శనివారం మహిళలతో గ్రామసభలను నిర్వహించారు. ఆయా సభల్లో పాల్గొన్న మహిళలకు ఆర్థికాభివృద్ధిపై గ్రామ పంచాయతీ కార్యదర్శులు అవగాహన కల్పించారు. విద్యా, ఉపాధి, వ్యవసాయ రంగాల్లో ముందుండాలని, నేడు పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళలు స్వశక్తితో ముందుకు వెళ్తున్నారన్నారు. వివిధ రంగాల్లో అభివృద్ధి చెందుతున్న మహిళలు, నాయకులు, ఆర్థిక వేత్తలు తదితరులపై మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు గణేశ్, సతీశ్‌రావు, ఈశ్వర్, ఉల్లాస్, సరిత, శ్వేత, బొజ్జిరావు, ప్రశాంత్, ప్రేంసాగర్, పెంటు, శ్రీవస్, జ్ఞానేశ్వర్, రమేశ్, రాజు ఉన్నారు.

కబడ్డీ విజేత టీఎంకే ఆర్మీ జట్టు


విజేతకు నగదు అందజేస్తున్న నాయకులు

కెరమెరి: మండలంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి జాతర సందర్భంగా నాలుగు రోజుల క్రితం ప్రారంభమైన కబడ్డీ పోటీలు శనివారం ముగిశాయి. మొత్తం 25 జట్లు పాల్గొనగా కెరమెరికి చెందిన టీఎంకే ఆర్మీ జట్టు విజేతగా నిలిచింది. వీరికి ప్రథమ బహుమతి రూ. 21 వేలు అందించారు. రెండో స్థానంలో అడ్డేసర జట్టు రూ. 15 వేలు, తృతీయ స్థానంలో బోరిలాల్‌గూడ జట్టు రూ.10 వేలు అందుకున్నాయి. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, నాయకులు తోడోసం జగన్నాథ్‌రావు, ఆత్రం రాము, కుమురం భీంరావు, పెందోర్ ఆనంద్‌రావు, సెడ్మకి తుకారాం, కోవ దేవ్‌రావు, ఎల్లప్ప, శ్రీనివాస్, లక్ష్మణ్, పూసం భీంరావు, తాలిబ్, సిరాజ్ తదితరులు ఉన్నారు.

‘సేవా కార్యక్రమాలు చేపట్టాలి’

కౌటాల: ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఎంఈవో గావుడే హన్మంతు అన్నారు. శనివారం కౌటాల ప్రాథమిక పాఠశాలలో స్థానిక హెచ్‌పీ గ్యాస్ డీలర్ దుర్గం జానకీరావు పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు, గ్లాసులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చదువుతోనే జీవితంలో ఉన్నతంగా ఎదుగుతారన్నారు. అవసరంలో ఉన్నవారికి సేవ చేస్తే ఎనలేని ఆనందం కలుగుతుందన్నారు. సేవ కార్యక్రమాలు చేయడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాలని తెలిపారు. ఉపాధ్యాయులు గణపతి, శ్రీనివాస్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

తడి అందక ఎండుతున్న వరి

- ఆందోళనలో అన్నదాతలు


ఎండిపోతున్న వరి పొలం

దహెగాం: యాసంగిలో సాగు చేస్తున్న వరి తడి అందక ఎండిపోతోంది. మండలంలోని కుంచవెల్లి గ్రామంలో రైతులు సాగు చేసిన వరికి నీటితడులు అందడంలేదు. దీంతో కళ్ల ముందే పంట ఎండి పోతుండగా రైతులు ఆందోళన చెందుతున్నారు. గత నెల 24న ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించలేదని రైతులు ఆరోపించారు. రెండు నుంచి మూడు రోజుల్లో మరో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, పది రోజులైనా పట్టించుకోకపోవడంతో సాంకేతిక సమస్యతో అది కాలిపోయిందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ కింద సుమారు 45 ఎకరాల వరకు వరి సాగవుతుండగా, గత నెల 24 నుంచి ఇప్పటివరకు నీటితడులు అందక పొలాలు ఎండి నెర్రెలు బారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 60 శాతం వరకు ఎండిపోయిందని, ఇప్పటికైనా తడి అందిస్తే మెరుగవుతుందని ఆశిస్తున్నారు. శనివారం ట్రాన్స్‌ఫార్మర్ బిగించినా ఇప్పటికే జరగాల్సిన నష్టం జరిగిందని, ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.